క్లుప్తంగా

పశువుల్లో గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ మురళీకృష్ణ

నెల్లిమర్ల రూరల్: పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పశు వైద్యులను సంప్రదించాలని పశు సంవర్ధ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ మురళీకృష్ణ సూచించారు. మండలంలోని మొయిద గ్రామంలో ఉచిత పశు గర్భకోశ వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు సరైన సమయంలో పశువుల ఎద లక్షణాలు గుర్తించి సంబంధిత పశు వైద్య సిబ్బందితో చికిత్స చేయించుకోవాలన్నారు. వ్యాధి నివారణకు టీకాలు పంపిణీ చేస్తున్నామని, పాడి రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఈవో రాధాకృష్ణ, మండల పశు వైద్యాధికారి వి.చంద్రశేఖర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్ బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం


రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం మహాదానమని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.వి.ఎస్.వెంకటరావు అన్నారు. మాజీ రాష్ట్రపతి, భారత రత్న ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా బుధవారం న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్దుల్ కలాం గొప్ప మానవతావాది అని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో కలాం కృషి అమూల్యమైనదన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, అబ్దుల్ రవూఫ్, సయ్యద్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు పీహెచ్‌సీని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జీవన్‌రాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మలేరియా, డెంగీ, డయేరియా తదితర వ్యాధులు బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి అఖిల, సీహెచ్‌సీ శారదాంబ, పీహెచ్‌ఎన్ వరలక్ష్మి, హెచ్‌వీ కళావతి, హెచ్‌ఎస్ శ్రీరామమూర్తి, సిబ్బంది అప్పలనాయుడు, హేమవతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ టీచర్లకు ఏపీటీఎఫ్ శుభాకాంక్షలు

విజయనగరం అర్బన్: డీఎస్సీ–2025 ద్వారా ఎంపికైన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉపాధ్యాయ వృత్తి స్వీకరించిన పలువురిని ఏపీటీఎఫ్ సంఘం అర్బన్ శాఖ ప్రతినిధులు బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీచర్ సర్వీసు రిజిస్టర్లను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ చేతులు మీదుగా కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్‌బుఖారీ బాబు, ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పట్టణ కమిటీ నాయకులు కె.రవి, మద్రాపు శ్రీనివాస్, బి.సుగుణాకర్, కె.శ్రీనివాస్, రమేష్, సంపూర్ణ, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ, వ్యయాలపై కచ్చితమైన సమాచారం ఇవ్వాలి

పూసపాటిరేగ : పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం, వ్యయాలపై కచ్చితమైన సమాచారం ఇవ్వాలని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో చైర్మన్ గేదెల గాయిత్రి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ భవనానికి రక్షణ గోడ, భవనం మొదటి అంతస్తులో సమావేశం మందిరం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి సతీష్, కమిటీ డైరెక్టర్లు ఎం.మోహన్‌రావు, పతివాడ రాముునాయుడు, గరే వెంకటరమణ, టి.సీతారాంతో పాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్..!

- అబ్కారీ శాఖకు భవనాల కొరత
- శిథిల భవనాల్లోనే ఎక్సైజ్‌స్టేషన్ కార్యాలయాలు
- అద్దె భవనాల్లోనే డీసీ, ఏసీ కార్యాలయాలు


శిథిలావస్థలో ఉన్న విజయనగరం ఎక్సైజ్ స్టేషన్లు ఉన్న పాత భవనం

విజయనగరం రూరల్ : ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని సమకూర్చుతున్న ఎక్సైజ్ శాఖకు జిల్లాలో సొంత గూడు లేక అద్దె భవనాలు, శిథిల భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, ఎక్సైజ్ సూపరింటిండెంట్ కార్యాలయం, విజయనగరం ఎక్సైజ్ 1, 2 స్టేషన్లు శిథిలమైన పాత భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం బాలాజీనగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతుండగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో మరో అద్దె భవనంలో కొనసాగుతుంది. అలాగే ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం కలెక్టరేట్‌లోని పాత భవనంలో కొనసాగుతుంది. విజయనగరం పట్టణ, గ్రామీణ ఎక్సైజ్ స్టేషన్లు పట్టణంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోని బొగ్గులదిబ్బ ప్రాంతంలో పాడుబడిన భవనాల్లోనే ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. వీటితో పాటు టాస్క్‌ఫోర్స్ కార్యాలయం అక్కడే ఉంది. అయితే విజయనగరం ఎక్సైజ్ స్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. స్టేషన్ భవనాల గోడలు, పైకప్పు శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణాన్న ఎవరి మీద కూలిపోతాయోనని భయంతో గడపాల్సి వస్తోందని అధికారులు, సిబ్బంది భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్టేషన్ పైభాగం పైకప్పు, గోడలు నానిపోయి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్టేషన్‌లో విధులు నిర్వహించడానికి వారు భయపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన పెంకుల షెడ్డుల్లోనే నేటికి స్టేషన్లు నిర్వహించడం, అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. స్టేషన్ ముందు భాగం పెంకులు ఊడిపోయి సిబ్బందిపై పడటంతో వారు గాయాల పాలవుతున్నారు. కొన్నేళ్ల క్రితం ఎక్సైజ్ అధికారులు వారు సొంత నిధులతో భవనం పైకప్పుకు మరమ్మతులు చేపట్టారు. కొత్త భవనాల నిర్మాణాలకు 2012లో సుమారు 1.6 కోట్ల రూపాయల నిధులు మంజూరైనా భవన నిర్మాణం పనులు సకాలంలో చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి మళ్లిపోయాయి. ఎక్సైజ్ స్టేషన్లు ఉన్న గూడ్సు షెడ్ ప్రాంతంలో ఆ శాఖకు సుమారు రెండెకరాల విశాలమైన సొంత స్థలం ఉంది. భవనాల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ స్థలంలో తుప్పలు, మొక్కలు ఏపుగా పెరిగి పాములకు ఆవాసాలుగా మారిపోయాయి. దీంతో అప్పుడప్పుడు విషసర్పాలు కార్యాలయంలోకి చొరబడి సిబ్బందికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు వెళ్లే రోడ్డు సైతం చిన్నపాటి వర్షం కురిస్తే నడవడానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఎక్సైజ్ శాఖ నుంచి అధిక ఆదాయాన్ని పొందే ప్రభుత్వం జిల్లా కేంద్రంలోనే సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడం లేదని ఆ శాఖ అధికారుల నుంచే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి, వాటిని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న మెనూ చార్జీలు, జీతాలు చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

భోగాపురం: మండలంలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సుమారు 4 నెలల జీతాలు, మెనూ చార్జీలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మధ్యాహ్న భోజన పథక కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. జీతాలు, మెనూ చార్జీలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు వండి పెట్టడం కష్టంగా ఉందని, జీతాలు కూడా కేవలం రూ.3 వేలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందన్నారు. మిగతా స్కీము వర్కర్ల వలె మాకు కూడా జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయిని ప్రభుత్వం మాత్రం మెనూ చార్జీలను పెంచలేదన్నారు. అనంతరం తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎల్.అమ్మాజీ, ఎం.విజయవతి, పి.పార్వతి, ఎం.ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమిషనర్ టి.జయరాం కోరారు. నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం అనధికార లేఅవుట్ల వివరాలు నోటీసు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం మాట్లాడుతూ అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని యజమానులు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏటీఎంఏ పి.డి. శ్రీనివాసరావు

భోగాపురం: వ్యవసాయ సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు వస్తాయని ఏటీఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలం కేంద్రంలో ఆయన సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లను ముందుగా గుర్తించి వాటిని సస్యరక్షణ పద్ధతుల ద్వారా ఏ విధంగా నివారించవచ్చో తెలిపారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడడం వలన పంటలకు పురుగులు, తెగుళ్లు ఎక్కువగా వస్తాయన్నారు. రైతుసేవా సిబ్బంది సిఫారసు మేరకు మాత్రమే ఎరువులు వాడాలన్నారు. వరి పంటలో వచ్చే ఆకు ముడత, సుడిదోమ, రెల్ల రొల్బు పురుగు, పాము పొడ, మాని పండు తెగుళ్లు, మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు, ఆకు పండు తెగులు వాటి నివారణ గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా డీఏటీటీ శాస్త్రవేత్త ఎంవివి.శ్రీనివాసరావు, ఏడీఏ ఎ.నాగభూషణ, ఎంఏవో హైమవతి, ఏఈవో వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

యాప్ ద్వారా మద్యం అమ్మకాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రవికుమార్

భోగాపురం: మండలంలో ఉన్న మద్యం షాపుల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మాత్రమే మద్యం అమ్మకాలు జరపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రవి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మండలంలో ఉన్న మద్యం షాపుల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం షాపుల్లో నిర్వహించే అమ్మకాలు కేవలం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా నిర్వహించాలన్నారు. ఎవరైన అనధికార మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేస్తే మద్యం షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార మద్యం దుకాణాలు నిర్వహించిన, ప్రొత్సహించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుని స్థానిక తహసీల్దార్ల వద్ద బైండవర్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు కె దుర్గాప్రసాద్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సత్య కళాశాలలో బాలికల ఎన్‌సీసీ ఎంపిక శిబిరం


ఎంపిక ప్రక్రియలో ఎన్‌సీసీ అధికారులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో 2(ఏ) గరల్స్ బెటాలియన్ విజయనగరం ఆధ్వర్యంలో బుధవారం బాలికల ఎన్‌సీసీ ఎంపిక శిబిరం జరిగింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులను 500 మీటర్ల పరుగు పందెం, ఎత్తు, బరువు, కంటిచూపు పరీక్ష, అవయవాల కదలిక పరీక్ష, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) అంచనా, లిఖిత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ వంటి అంశాల ఆధారంగా పరీక్షించారు. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర, సుబేదార్ మేజర్ డీఎస్ బొడలే, సుబేదార్ ధనేష్ చంద్ర దివేది, సుబేదార్ రాజవీర్‌సింగ్, సుబేదార్ నాగరాజు, జీసీఐ పల్లవి పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో సత్య డిగ్రీ, పీజీ కళాశాల, విశాఖ మహిళా కళాశాల బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బాలికల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. కార్యక్రమంలో సీతం ఇంజినీరింగ్ డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్‌కిరణ్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విద్యార్థినుల బృందాన్ని అభినందిస్తున్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. స్థానిక మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి వద్ద ప్రముఖ రచయిత్రి కొంకేపూడి అనురాధ బృందం ఆలపించిన నామ రామాయణం ఆద్యంతం ఆకట్టుకుంది.

తమ్మిన సిస్టర్స్ శాస్త్రీయ సంగీత కచేరీ అలరించింది. కొనపాల లక్ష్మీ బృందం బుర్రకథ, ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. వనంగుడి వద్ద నిత్యదైవ నామస్మరణ సేవా సమితి పి.ఉమాశంకర్ బృందం భరతనాట్యం, వై.సాయిదుర్గాప్రసాద్ గిటార్ కచేరీ, కాకినాడ కుసుమ భక్తిసంగీతం అలరించాయి. ఆలయ అధికారులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళులు


విజయనగరం: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న దృశ్యం

విజయనగరం: భారతరత్న, మిసైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా సాయికృష్ణ వాకర్స్ క్లబ్ సభ్యులు ఘన నివాళులర్పించారు. స్థానిక అయ్యన్నపేట, క్లబ్ నడక మైదానం వద్దనున్న జగదాంబ నగర్‌లో బుధవారం క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా క్లబ్ పెద్దలంతా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ప్రకాశరావు మాష్టారు మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం మహోన్నత వ్యక్తి అని, తన నిరాడంబరమైన జీవితంతో, శాస్త్రవేత్తగా, దేశానికి రాష్ట్రపతిగా అద్వితీయ సేవలు అందించారన్నారు. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని, సామాన్య కుటుంబంలో పుట్టి, దేశానికి రాష్ట్రపతిగా ఎదిగిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జి.గోవిందరావు, కోట్ల సత్యనారాయణ, వై.నలమహారాజు, పి.అప్పలరాజు, యోగ గురువు సాలూరు చక్రధర్, జి.శ్రీనివాస్, ప్రసాద్, అప్పలరాజు, నరసింహామూర్తి, బాలు పాల్గొన్నారు.

దేశానికి మార్గదర్శకుడు అబ్దుల్ కలాం


డెంకాడ: విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి

డెంకాడ: మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్‌కలాం దేశానికి మార్గదర్శకుడైన శాస్త్రవేత్త అని లెండి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియాకు హ్యాకథాన్‌కు ఎంపికైన 50 మంది విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. సైన్స్, టెక్నాలజీ రంగాలలో సృజనాత్మక, సాంకేతిక ప్రతిభను ప్రతిబింబిస్తూ పోస్టర్‌ల ప్రదర్శన నిర్వహించారు. వీటిని ప్రిన్సిపాల్ రామారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తిలకించి, పోస్టర్లలో పొందుపరిచిన విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు టి.హరిబాబు, వి.అంజిరెడ్డి, ఐబీసీ డీన్ కేవై వసంత్, ఐక్యూఏసీ డీన్ బీవీఎస్ ఆచార్యులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవల మరువలేనివి

విజయనగరం రూరల్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు మరువలేనివని మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అద్బుల్ ఆదిల్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అద్బుల్ ఆదిల్, మైనారిటీ నాయకులు బిలాల్ అహ్మద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పతివాడ రాజేష్, ఇమంది సుధీర్, కొండల శ్రీనివాసరావు, అప్పారావు దొర, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా బాధ్యతల స్వీకరణ

భోగాపురం: భోగాపురం మండల వెలుగు సమాఖ్య ఏపీఎంగా పి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా కేంద్రంలో ఏపీఎంగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏపీఎంగా ఇక్కడ విధులు నిర్వహించిన జగదీష్‌కుమార్ బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లారు.

ఆర్థిక సాయం అందజేత

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన బోనుల లక్ష్మణ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతడిది పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బాధితుడికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం పోలిపల్లిలోని తన స్వగృహంలో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో పిడుగు వెంకటసత్యం, పాలపర్తి లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

నెల్లిమర్ల: స్థానిక మిమ్స్‌లో సీపీఆర్ (హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం) పై సామాన్యులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనస్థీషియా (మత్తు) విభాగాధిపతి డా. అన్నపూర్ణ శర్మ మాట్లాడుతూ ఒక వ్యక్తికి గుండె కొట్టుకోవడం లేదా శ్వాస తీసుకోవడం ఆగిపోయినప్పుడు, ప్రాణాలను రక్షించడానికి చేసే అత్యవసర ప్రక్రియ ఇది అని పేర్కొన్నారు. దీనిపై సామాన్య ప్రజలకు, నర్సింగ్, వైద్య విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించాలని అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సచివాలయాల వారీగా ఎంత మేర పన్ను వసూళ్లు జరిగాయన్న విషయాలపై ఆరా తీస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ మొత్తాలను వసూలు చేసిన కార్యదర్శులను మందలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వసూళ్లు పెంచి, లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ దినచర్య వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అప్పలరాజు, వినోద్ కుమార్, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

లైబ్రరీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి : డీవైఎఫ్‌ఐ



డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద ధర్నా

విజయనగరం గంటస్తంభం: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని రకాల గ్రంథాలయ పోస్టులను వెంటనే భర్తీ చేసి రెండు లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న హెచ్చరించారు. బుధవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విజయనగరంలో గురజాడ లైబ్రరీ నుంచి కోటా జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ హరీష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు లక్షల మంది లైబ్రరీ విద్యార్థులు నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. హైస్కూల్ లైబ్రరీలను పునరుద్ధరించడమే కాక, ప్రతి పంచాయతీలో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లైబ్రరీ సెస్ వసూళ్లు నేరుగా గ్రంథాలయ సంస్థలకు చేరేలా సాఫ్ట్‌వేర్ రూపొందించాలని, వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సతీష్, తిరుపతి, నిరుద్యోగులు వెంకట్ రమణ, ఆదిత్య, రాజా, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న నాగ సుశీల


పైడితల్లి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నాగ సుశీల

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని అక్కినేని నాగార్జున సోదరి నాగ సుశీల బుధవారం సందర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు వేదాశీస్సులను, అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.